సాక్షి శ్రీకాకుళం

బుధవారం । 4 । జూన్ । 2025



శ్రీకాకుళం నగరంలోని దమ్మల వీధిలో నడవలేని పరిస్థితిలో మంచం మీదే రేషన్ కోసం ఎదురుచూస్తున్న పుక్కల్ల వీరమ్మ

రేషన్ కోసం ఎదురుచూపులు

వృద్ధులు, వికలాంగులు రేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. వీరికి సమాచారం ఇచ్చే వారు లేకపోయారు. ఇదివరకు రేషన్ వాహనాలు ఇంటి వద్దకే రావడంతో వీరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా రేషన్ అందేది. ప్రభుత్వం వాహనాలు రద్దు చేయడంతో వీరికి తిప్పలు తప్పడం లేదు. -8లో

న్యూస్‌రీల్

48 బస్తాల పీడీఎస్ బియ్యం పట్టివేత



బలదలో బియ్యం పట్టుకున్న రెవెన్యూ అధికారులు

కొత్తూరు: అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. మండలంలోని బలద గ్రామంలో మాధవ హరి అనే వ్యక్తి ఇంటి వరండాలో 48 బస్తాలు (2400 కిలోలు) నిల్వ ఉంచడంతో సమాచారం అందుకున్న విజిలెన్స్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా పట్టుకున్నారు. కేసు నమోదు చేసిన అనంతరం సరుబుజ్జిలి ఎంఎల్ఎస్ కేంద్రానికి తరలించారు.

గారపేట యువకునికి రూ.71 లక్షల ప్యాకేజీ



పొట్నూరు దిలీప్

పొందూరు: మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన పొట్నూరు దిలీప్ అనే యువకుడు క్యాంపస్ సెలెక్షన్‌లో రూ.71 లక్షల ప్యాకేజీతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. లక్నో ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ విభాగంలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన దిలీప్ బెంగళూరుకు చెందిన రూబరిక్ ఇండియా లిమిటెడ్ అనే కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా భారీ ప్యాకేజీతో ఎంపికయ్యాడు. దిలీప్ తండ్రి పట్నాన రమణ బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్‌లో అధికారిగా పనిచేస్తుండగా తల్లి సుజి గృహిణి.

పచ్చదనమే లక్ష్యం: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాను పచ్చదనంతో నింపడమే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మొక్క ల సంఖ్య, వాటి లభ్యత అంచనా వేయాలని, ట్రీగార్డులు సిద్ధం చేయాలని, సోక్ పిట్స్, కంపోస్ట్ పిట్స్ పూర్తిచేయాలన్నారు. యోగాంధ్ర ప్రచారం 2025 కోసం ముందస్తు సన్నాహాలు చేయాలన్నారు. ప్రధానమంత్రి మోదీ పాల్గొనే ఈ కార్యక్రమానికి శ్రీకాకుళం, ఎచ్చెర్ల, ఆమదాలవలస ప్రాంతాల నుంచి 20 వేల మంది యో గా అభ్యాసకులను సిద్ధం చేయాలన్నారు. పింఛన్ల పంపిణీలో లోటుపాట్లు తెలుసుకోవాలని, అన్న క్యాంటీన్లలో ఆహార నాణ్యత, పరిశుభ్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు.

మందగించిన బియ్యం పంపిణీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా రేషన్ బియ్యం పంపిణీ మందగించింది. రేషన్ డిపోల ద్వారా బియ్యంను లబ్ధిదారులకు అందజేసే కార్యక్రమం ప్రారంభించి మూడు రోజులైంది. జిల్లాలో 6,60,739 తెలుపు రంగు బియ్యం కార్డులు ఉండగా, వాటిలో మంగళవారం సాయంత్రం వరకు కేవలం 2,40,948 కార్డుదారులు మాత్రమే రేషన్ బియ్యాన్ని విడిపించుకొన్నారు. మూడు రోజుల్లో కేవలం 36.47 శాతం మందికి మాత్రమే బియ్యంను అందజేశారు. మండుతున్న ఎండలకు తాళలేక చాలా మంది డిపోలకు వెళ్లడం లేదు. దీనికి తోడు ఎప్పటికప్పుడు సర్వర్ సమస్యలు వేధిస్తుండడంతో డిపోలకు వెళ్లి వెనక్కి వచ్చేస్తున్న వారూ ఉన్నారు. ఎండీయూ వాహనాల కాలంలో ఈ అవస్థలు ఉండేవి కావు. ఐదు పది నిమిషాల్లో అందరికీ పంపిణీ జరిగిపోయేది. వలంటీర్లు రేషన్ బండి ఎప్పుడొస్తుందో ఇంటింటికీ సమాచారం అందించేవారు. ఇప్పుడు డిపోల వద్దకు వెళ్లాల్సి వస్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

మొరాయిస్తున్న ఈ పాస్

జిల్లా వ్యాప్తంగా తూనిక యంత్రాలు తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. నెట్‌వర్క్ సమస్యల కు తోడు ఎండలు కూడా మండిపోతుండడంతో ప్రజలు యాతన పడుతున్నారు.

నిర్లక్ష్యపు ధార..



బెండికొండ వద్ద లీకై రోడ్డుపైకి వచ్చిన నీరు

కాశీబుగ్గ: ఉద్దాన వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టుపై నిర్లక్ష్యపు నీడ పడుతోంది. పలాస నుంచి బెండి వెళ్లే మార్గం మధ్యలో బెండికొండపైన ఉండే ట్యాంకర్‌కు వెళ్లే పైపు లీకవడంతో ఒక్కసారిగా రోడ్డుపైకి వరదనీరు చేరింది. సాయంత్రానికి ఈ రోడ్డు చెరువును తలపించింది. ఉద్దాన ప్రాజెక్టు అధికారులు తక్షణమే లీకేజీలను సరిచేయాలని పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

పథకాలు ప్రత్యర్థులు వనరులు సర్వం హననం!


ఇదే టీడీపీ కూటమి ఏడాది పాలన ఘనత



నాకు ఆడబిడ్డలు లేరు. మీరే నాకు ఆడబిడ్డలు. మహిళలను మహాశక్తిగా తీర్చిదిద్దే బాధ్యత నాది. ప్రతి మహిళకు నెలకి రూ.1500 అందిస్తాను. చదువుకున్న ప్రతి బిడ్డకు తల్లికి వందనం కింద రూ. 15వేలు ఇస్తాను. మహిళలకు ఉచిత బస్ ఆర్టీసీ ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తాను. సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా సరఫరా చేస్తాను. స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేకుండా రూ.10లక్షల రుణాలు ఇస్తాను. అందరికీ రెండు సెంట్లు స్థలమిచ్చి, ఇళ్లు కట్టించే బాధ్యత తీసుకుంటాను. మహిళలకు 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తాం.

– గత ఏడాది ఏప్రిల్ 24వ తేదీన శ్రీకాకుళంలో మహిళలతో నిర్వహించిన సమావేశంలో చంద్రబాబు చేసిన ప్రసంగం





అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి రైతుకు రూ.20వేల ఆర్థిక సాయం అందజేస్తాను. ఆక్వా సాగుకు యూనిట్ విద్యుత్ రూ.1.50కి ఇస్తాం. రాయితీపై ట్రాక్టర్లు, యాంత్రీకరణ పథకాన్ని అమలు చేస్తాను. ఏటా 4లక్షలు చొప్పున ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ఉచిత ఇసుకతో నిర్మాణ రంగాన్ని నిలబెడతాం. వలంటీర్ల జీతాలు రూ.10వేలు చేస్తాం.


– గత ఏడాది ఏప్రిల్ 23వ తేదీన టెక్కలి, శ్రీకాకుళం ఎన్నికల ప్రచార సభల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలివి



అధికారంలోకి రాగానే పాతపట్నం నియోజకవర్గంలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తాను. ఇక్కడే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, అగ్నిమాపక కేంద్రం, 100 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేస్తాం. పురుషోత్తపురం వద్ద, ముద్దాడపేట వద్ద వంతెనల నిర్మాణాలు పూర్తి చేస్తాం. నారాయణపురం ఆనకట్ట ఆధునికీకరణ పనులు పూర్తి చేస్తాం. నిర్వాసితులకు న్యాయం చేస్తాం. – గత ఏడాది ఏప్రిల్ 23న పాతపట్నం, ఆమదాలవలసలో జరిగిన సభల్లో చంద్రబాబు వాగ్దానం



కూటమి ప్రభుత్వం రాగానే మత్స్యకారులకు సంబంధించిన జీఓ 217రద్దు చేస్తాం. పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేస్తాం. కిడ్నీ వ్యాధులపై పరిశోధనలు చేస్తాం. జీడి పిక్కల 80కిలోల బస్తా మద్దతు ధర రూ. 16వేలు చేస్తాం. ఆఫ్‌షోర్ ప్రాజెక్టును పూర్తి చేస్తాం. వంశధార కాలువలకు సిమెంట్ లైనింగ్ పనులు చేస్తాం. – గత ఏడాది ఏప్రిల్ 15న పలాసలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో చంద్రబాబు



వైఎస్ జగన్ హయాంలో సర్వం భ్రష్టు పట్టాయని శాపనార్థాలు పెట్టారు. తాము అధికారంలోకి వస్తే ఆకాశాన్ని నేలకు దించేస్తామన్నట్లు హామీలు గుప్పించారు. కానీ అధికారంలోకి వచ్చాక.. కొత్త వాటి సంగతలా ఉంచి.. ఉన్న పథకాలనే కూటమి సర్కారు ఊడ బెరికేసింది. అదే సమయంలో ప్రత్యర్థులే ఉండకూడదన్నట్లుగా దాడులు, హత్యలు అరాచకాలతో రెచ్చిపోతోంది. మరో వైపు ప్రకృతి వనరులను విచ్చలవిడిగా దోచుకోవడమే ధ్యేయంగా కూటమి ఏడాది పాలన సాగింది.

- ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు పంగనామం
- 143 హామీల్లో ఐదు కూడా అమలు చేయని పరిస్థితి
- ఆర్థిక సంక్షోభం పేరుతో కాలయాపన

మా ప్రభుత్వం ఏర్పాటు కాగానే వంశధార, నాగావళి నదులను అనుసంధానం చేస్తాం. పలాసలో డిఫెన్స్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తాం. నరసన్నపేట పరిధిలో ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తాం. వంశధార–బాహుదా నదులను అనుసంధానం చేస్తాం. కళింగ వైశ్యులను ఓబీసీలో చేర్చుతాం. టెక్కలిలో వైద్య కళాశాల ఏర్పాటు చేస్తాం. బుడగట్లపాలెంలో మత్స్యకార జెట్టీ నిర్మాణం చేస్తాం. – గత ఏడాది ఫిబ్రవరి 27న శ్రీకాకుళంలో జరిగిన రా కదలిరా సభలో చంద్రబాబు హామీలు

అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్‌లో ఉన్న పథకాలన్నింటినీ అమలు చేస్తాం. చెప్పినవన్నీ అమలు చేసే పూచి నాది. నేనే బాధ్యత తీసుకుంటా. – గత ఏడాది జిల్లాలో మూడు రోజుల పాటు నిర్వహించిన ప్రజాగళం సభల్లో సూపర్ సిక్స్ కరపత్రం, బ్యాగ్‌లను చూపించి లోకేష్ చేసిన ప్రసంగం.

అరాచక రాజ్యం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కూటమి ప్రభుత్వం వచ్చాక అరాచకం రాజ్యమేలుతోంది. ఏడాది కాలంగా దొరికినకాడికి దోచుకోవడం, కనిపించిన ప్రభుత్వ భూములు కబ్జా చేయడం, ఇసుక, గ్రానైట్, గ్రావెల్, మట్టిని మింగేయడం, అడ్డొచ్చిన వాళ్లపై దాడులు చేయడం, అవసరమైతే హత్యలకు పాల్పడటం వంటివి ప్రస్తుతం షరా మామూలుగా మారిపోయాయి.



టీడీపీ వర్గీయుల దాడిలో తీవ్రంగా గాయపడి మరణించిన కూన ప్రసాద్ (ఫైల్)



లక్ష్మీపురం ఎంపీటీసీ మోహన్‌రావుపై హత్యాయత్నం (ఫైల్)



శ్రీకాకుళంలో సురేష్‌పై నడిరోడ్డుపై దాడి (ఫైల్)

హత్యతో శ్రీకారం

- 2024 మే 16న మంత్రి అచ్చెన్నాయుడు సొంత పంచాయతీ నిమ్మాడలోని వెంకటాపురం గ్రామ అమ్మవారి ఉత్సవాల్లో తోట మల్లేసు అనే వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆయన తీవ్రంగా గాయపడి చనిపోయారు. మల్లేసు వైఎస్సార్‌సీపీ ఏజెంట్‌గా పనిచేశారు.
- 2024 ఆగస్టు 18 అర్ధరాత్రి ఎచ్చెర్ల ఫరీద్‌పేటకు చెందిన వైఎస్సార్ సీపీ సాధారణ కార్యకర్త కూన ప్రసాద్‌పై దాడి చేశారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆగస్టు 24న మరణించాడు.

దాడులకు కొదవలేదు

- పలాస మండలం లక్ష్మీపురం ఎంపీటీసీ గుండు మోహనరావుపై జూన్ 7న రాత్రి పొలం వద్ద కాపు కాసి ఇనుపరాడ్లతో టీడీపీ కార్యకర్తలు హత్యాయత్నానికి పాల్పడ్డారు.
- శ్రీకాకుళం మండలం భైరివానిపేటకు చెందిన శిమ్మ అప్పన్న, బగ్గు రామారావుపై జూన్7న రాత్రి టీడీపీ కార్యకర్తలు రాజకీయ కక్షలతో కర్రలతో దాడులు చేశారు.
- 2024 అక్టోబరు 16న జిల్లా నడిబొడ్డున బలగమెట్టు వద్ద వందల మంది జనాలు చూస్తుండగా సనపల సురేష్ అనే వ్యక్తి కారును జీపు, బైకులతో ఎమ్మెల్యే కూన రవికుమార్ అనుచరులు దాడి చేశారు. కారులో ఉన్న సురేష్‌ను బయటకు లాగి పిడిగుద్దులు వర్షం కురిపించి, బట్టలు చింపేసి పక్కనే ఉన్న కాలువలోకి తోసేశారు.
- 2024 అక్టోబరు 27న కోటబొమ్మాళి మండలం కిష్టుపురంలో దళిత దంపతులైన చల్ల అప్పలరాజు, దమయంతిలపై టీడీపీ గూండాలు ధర్మాన శ్రీను, ధర్మాన ప్రసాద్, తంగి షణ్ముఖ, పల్లి వైకుంఠరావు, పగోటి సీమలు, పగోటి అప్పారావు, మరో 70 మంది ఇంటికొచ్చి మరీ దాడికి పాల్పడ్డారు.
- 2024 అక్టోబరు 27న ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అనుచరులు అల్లు రమణ, మన్మధలపై కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ లోనే టీడీపీ నాయకులు దాడి చేశారు.
- 2025మార్చి 23న ఇచ్ఛాపురం మండలం మఖరాపురం గ్రామంలో ఒకే ఒక్క విశ్వబ్రాహ్మణ కుటుంబం వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉండటంతో ఆ కుటుంబంలోని వ్యక్తిపై దాడి చేశారు.

ఇసుక దోపిడీ..



ఆమదాలవలస మండలం ఇసుకల పేట వద్ద అనధికారకంగా స్టాక్ చేసిన ఇసుక ఇది (ఫైల్)

జిల్లాలో అంతులేని ఇసుక దోపిడీ జరుగుతోంది. అక్రమ తవ్వకాలు ఒక ఎత్తయితే.. ఆ అక్రమ ఇసుకను తరలించేందుకు నకిలీ బిల్లులు సృష్టించడం మరో ఎత్తు. తెలుగు తమ్ముళ్లు, నాయకులు ఉచిత ఇసుక ముసుగులో దోచేస్తున్నారు. అంతా కుమ్మక్కై కోట్లాది రూపాయల ప్రజా సొమ్మును జేబుల్లో వేసుకున్నారు. ఇటు రణస్థలం నుంచి అటు ఇచ్ఛాపురం వరకు దేన్నీ వదలకుండా తవ్వి తీసుకెళ్లిపోతున్నారు.

గ్రావెల్ దందా



పలాస కాశీబుగ్గలోని సూదికొండపై ప్రొక్లెయినర్‌తో మట్టి తవ్వకాలు(ఫైల్)

రణస్థలం మండలం సంచాం కొండ, పలాసలోని సూదికొండ టీడీపీ నాయకుల గ్రావెల్ దందాలకు ఉదాహరణలు. ప్రభుత్వ భూములు, చెరువులు కబ్జా చేసి అడ్డగోలుగా తవ్వేసి మట్టి తరలిస్తున్నారు. లేఅవుట్లు, ఇతరత్రా అవసరాల కోసం ప్రభుత్వ భూ ములను దర్జాగా చదును చేసి గుప్పెట్లో పెట్టుకుంటున్నారు.

లిక్కర్ అవినీతి

లిక్కర్ సిండికేట్‌గా మారి నేతలు కోట్లు కొల్లగొడుతున్నారు. ఇప్పుడంతా సిండికేట్ రాజ్యమేలుతోంది. ప్రస్తుతం జిల్లాలో వైన్ షాపులకు అనుబంధంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఒక్కో షాపు పరిధిలోని గ్రామాల్లో 10 నుంచి 40 వరకు బెల్ట్ షాపులు అనుబంధంగా పనిచేస్తున్నాయి.

విచ్చలవిడిగా మైనింగ్..



పొందూరు మండలం గారపేటలో అక్రమంగా నడుస్తున్న క్వారీ(ఫైల్)

మైనింగ్ అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. టెక్కలి నియోజకవర్గంతో పాటు మెళియాపుట్టిలో కీలక నేత కనుసన్నల్లో మైనింగ్ అక్రమాలు జరుగుతుండగా, ఆమదాలవలస మరో కీలక నేత ఆధ్వర్యంలో మైనింగ్ దందా నడుస్తోంది. రోజుకి రూ. కోట్లలో అక్రమ మార్గంలో ఆర్జిస్తున్నారు.

రోడ్ల ముసుగులో అవినీతి




ఇచ్ఛాపురం మండలంలో రూ.15 లక్షలు వెచ్చించి మరమ్మతులు చేయించిన తులసిగాం - కేశుపురం రోడ్డు దుస్థితి(ఫైల్)

అటు మరమ్మతుల రోడ్లు, ఇటు ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ కింద చేపట్టిన రోడ్లు తెలుగు తమ్ముళ్లకు కాసులు కురిపించాయి. దాదాపు రూ.185 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఉపాధి రోడ్లలో భారీగా అక్రమాలు జరిగాయి. స్వప్రయోజనాలకు రోడ్లు వేసుకుని ఉపాధి నిధులను దుర్వినియోగం చేశారు. మంత్రి అనుచరుడు, ఎమ్మెల్యేల మనుషులే దాదాపు కాంట్రాక్టర్ల అవతారమెత్తి నాసిరకం పనులతో నిధులు స్వాహా చేసేశారు.

ఏడాది పాలన ఇదేనా బాబూ..

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

చంద్రగ్రహణం ఎక్కడైనా ఒక్క పూటే ఉంటుంది. కానీ రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు ఏడాదిగా చంద్ర గ్రహణం పట్టుకుంది. ఎన్నికల ప్రచారాల్లో మైకు దొరికినప్పుడల్లా హామీల వర్షం కురిపించిన కూటమి నాయకులు అమలు సమయానికి ఆర్థిక సంక్షోభం అంటూ సాకులు చెబుతున్నారు. సంక్షేమ పథకాలు సమర్థంగా అమలవుతుంటే రాష్ట్రం మరో శ్రీలంక అయిపోతుందంటూ అప్పట్లో ప్రతిపక్షంలో ఉంటూ గగ్గోలు పెట్టిన చంద్రబాబు అండ్ కో అవే హామీలు ఇచ్చి గద్దెనెక్కారు. ఎన్నికలకు ముందు 143 హామీలిచ్చి, వాటిలో పట్టుమని ఐదు కూడా అమలు చేయలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించారు. చెప్పింది చెప్పినట్లు అమలు చేశారు. కానీ ఇప్పుడు మాత్రం మాటలు మార్చే పనిలో అమాత్యులంతా బిజీగా ఉన్నారు.



సాగు సాయమేదీ?



చంద్రబాబు చెప్పిన పెట్టుబడి సాయం కోసం రైతులు కళ్లు కాయలు కాసేలా చూస్తున్నారు. ఏడాది దాటుతున్నా పెట్టుబడి సాయం ఇవ్వలేదు. జిల్లాలో 3,14,212 మందికి ఇప్పటికే మొదట ఏడాదికి సంబంధించి రూ.628.42కోట్లు మేర ఎగ్గొట్టారు. ఈ ఏడాదికి సంబంధించైనా ఇస్తారనుకుంటే అతీగతి లేదు.

– వైఎస్ జగన్ హయాంలో జిల్లాలోని 3,14,212 మంది రైతులకు రూ.1876.55 కోట్లును నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు.

ఒక్క రూపాయి ఇవ్వలేదు..



అన్నదాత సుఖీభవ పేరుతో పెట్టుబడి సాయం ఇస్తామన్నారు. ఇంతవరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఈ ఏడాది ఇంత వరకు విత్తనాల జాడ లేదు.

– ప్రగడ ప్రభాకరరావు, రైతు, నందిగాం

నిరుద్యోగులకు కుచ్చుటోపీ



సంవత్సరానికి నాలుగు లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ఉద్యోగం వచ్చే లోపు నిరుద్యోగికి నెలకి రూ.3వేలు చొప్పున ప్రకటించారు. అధికారం దక్కాక ఆ మాటే మర్చిపోయారు. 7,28,210 మందికి రూ.218.46 కోట్లు మేర ఇవ్వకుండా మొండి చేయి చూపారు.

నిరుద్యోగ భృతి ఊసెత్తడం లేదు



అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు భృతి కల్పిస్తామని ఎన్నికల మునుపు కూటమి నాయకులు హామీ ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నప్పటికీ నిరుద్యోగ భృతి ఊసెత్తడం లేదు. – డి.నీలకంఠం, ఎమ్మెస్సీ, బీఈడీ, సంతబొమ్మాళి

కూటమి మోసాలు ప్రజలకు చెబుదాం

- నేడు వెన్నుపోటు దినం విజయవంతం చేయండి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపు



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): పార్టీ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని బుధవారం శాంతియుతంగా నిర్వహించి, ప్రజల ఆవేదనను ప్రభుత్వానికి తెలియజేయాలని వైఎస్సార్ సీపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త సన్నద్ధంగా ఉండాలని ఆయన కోరారు. గత ఏడాదిగా ప్రజలకు జరిగిన మోసాన్ని స్పష్టంగా చెప్పాలన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో బుధవారం ర్యాలీలు నిర్వహించి, ప్రభుత్వ అధికారులకు వినతి పత్రా లు అందజేయనున్నట్లు తెలిపారు. ఎక్కడైనా అడ్డంకులు కల్పించే య త్నం జరిగినా, వాటిని న్యాయపరంగా ఎదుర్కొంటామని, అవసరమైతే మీడియా ఎదుట వివరించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్ర భుత్వంపై ఉన్న ప్రజా వ్యతిరేకత స్పష్టంగా బ యటపడేలా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమం ప్రజల మనోవేదనను ప్రభుత్వానికి తెలియజేసే శాంతియుత ఉద్యమమని వివరించారు.

అంతా గ్యాసే..



గ్యాస్ కనెక్షన్లు ఉన్న వారందరికీ మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టారు. అధికారంలోకి వచ్చాక కొన్ని నెలల తర్వాత మూడు సిలిండర్లలో ఒక సిలిండర్ ఇచ్చి చేతులు దులుపుకున్నారు. జిల్లాలో ఉచిత గ్యాస్ సిలిండర్లు కోసం 7,28,210మంది అర్హులు ఉన్నారు. కానీ వారిలో వివిధ ఆంక్షలు పెట్టి కొందరినే లబ్ధిదారులుగా చూపించారు.

ఒక సిలిండరేనా..?



ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టారు. ప్రస్తుతానికి ఒక సిలిండర్ డబ్బులు మాత్రమే వేశారు. లబ్ధిదారుల సంఖ్య కూడా తగ్గించేస్తున్నారు.

– పి.తేజేశ్వరరావు, 10వ వార్డు కౌన్సిలర్, ఇచ్ఛాపురం

వంచనలో తల్లికి వందనం



'నీకు రూ.15వేలు, నీకు రూ. 15వేలు, నీకు రూ. 15వేలు' అంటూ ఎన్నికల ముందు ఊదరగొట్టారు. ఇంతవరకు ఒక్కపైసా ఇవ్వలేదు. ఒక విద్యా సంవత్సరం ముగిసిపోయింది. దాదాపు రూ.484.52కోట్ల మేర తల్లిదండ్రులు కోల్పోయారు. మరో విద్యా సంవత్సరం ప్రారంభమైంది. కానీ తల్లికివందనంకు అతీగతి లేదు. జిల్లాలో తల్లికి వందనంకు అర్హులైన 3,23,019 మంది ఎదురు చూస్తున్నారు. –వైఎస్ జగన్ హయాంలో నాలుగేళ్లలో రూ.1334.51కోట్ల మేర తల్లుల ఖాతాలకు అమ్మఒడి పథకం కింద జమ చేశారు.

ఏడాది దాటింది..



గత ప్రభుత్వం అమ్మ ఒడి ఠంచనుగా ఇచ్చేది. టీడీపీ హామీ ఇచ్చింది గానీ ఏడాదిగా రూపాయి కూడా విడుదల చేయలేదు. ఇప్పటికీ దీనికి సంబంధించి ఎలాంటి సమాచారం లేకుండా పోయింది. – బోర చంద్రకళ, 25వార్డు, పలాస–కాశీబుగ్గ

మహిళకు రూ.1500 ఏదీ..?



అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామన్న విషయాన్ని టీడీపీ నేతలు మరిచిపోయినట్టు వ్యవహరిస్తున్నారు. జిల్లాలో ఈ పథకం కింద 7,59,692మంది అర్హులు ఉన్నారు. ఇప్పటికే ఒక సంవత్సరానికి సంబంధించి రూ.113.95కోట్ల మేర వీరు కోల్పోయారు. రెండో సంవత్సరం వచ్చేసింది కానీ అమలు దిశగా అడుగులు పడటం లేదు.

– వైఎస్ జగన్ ఐదేళ్ల కాలంలో రూ.1345.12కోట్లు మహిళల ఖాతాలకు జమ చేశారు.

రూ.1500 ఇవ్వాల్సిందే



మహిళలకు ప్రతి నెలా రూ.1500 ఇస్తామని ప్రచారం హోరెత్తించారు. అధికారం దక్కాక ఆ ఊసే లేకుండా పోతోంది. హామీలు ఇచ్చాక మరచిపోతే ఎలా..? నాతో పాటు మహిళలందరికీ రూ.1500 ఇవ్వాల్సిందే.

– బెనియా విజయలక్ష్మి, తెంబూరు గ్రామం

50 ఏళ్లకు పింఛనేదీ..?

అధికారంలోకి వచ్చిన వెంటనే 50 ఏళ్లకే మహిళలకు పింఛన్ మంజూరు చేస్తామని చెప్పారు. దీంతో మహిళలు ఆశ పడ్డారు. కానీ గెలిచినాక చంద్రబాబు 50 ఏళ్ల పింఛన్ జోలికి వెళ్లలేదు సరికదా ఉన్న పింఛన్లు తీసేస్తున్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం జిల్లాలో 3,07,537 మంది 50 ఏళ్ల పింఛన్‌కు అర్హులుగా ఉన్నారు. వీరికే ఏడాది కాలంగా ఎదురుచూపులే మిగిలాయి.

పింఛన్ వచ్చేనా..



బీసీ కులాలకు చెందిన వారికి 50 ఏళ్లు దాటాక పింఛన్ ఇస్తామన్నారు. బీసీల సంగతి పక్కన పె డితే కొత్త వారికి కూడా పింఛన్లు మంజూరు కావటం లేదు.

– పల్లి సంజీవ్, రైతు, దబ్బపాడు

చదువు'కొనాల్సిందే'



విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేదు. వసతి దీవెన, విద్యా దీవెన అందించలేదు. జిల్లాలో 45,657 మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

విద్యకు దూరమవుతున్నారు



ఫీజు రీయింబర్స్ చేయకుండా కూటమి ప్రభుత్వం వేధిస్తోంది. ఇంజినీరింగ్, డిగ్రీ, ఎంబీఏ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ ఇవ్వడం లేదు.

– ముద్దాడ రాజశేఖర్ యాదవ్, జేఆర్ పురం పంచాయతీ

చార్జీల వడ్డన-సేవలు బంద్

కూటమి ఏడాది పాలనలో విద్యుత్ చార్జీలు పెంచేశారు. ఆస్తి పన్ను పెంచేస్తున్నారు. మరోవైపు ఇంటింటికీ అందాల్సిన వలంటీర్ల సేవలను నిలిపివేశారు. సచివాలయాలను నిర్వీర్యం చేసేశారు. తాజాగా ఇంటింటికీ అందించే రేషన్ సరుకులు నిలిపివేశారు. మళ్లీ ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి.

చార్జీలు పెరుగుతున్నాయి..



విద్యుత్ చార్జీలు పెంచేశారు. మున్సిపాలిటీలో ఆస్తి పన్ను పెంచేస్తున్నారు. మరోవైపు ఇంటింటికీ అందాల్సిన వలంటీర్ల సేవలను నిలిపివేశారు. సచివాలయాలను నిర్వీర్యం చేసేశారు. తాజాగా ఇంటింటికీ అందించే రేషన్ సరుకులు నిలిపివేశారు. మళ్లీ ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. – నున్నగావుల చిన్నారావు, ఊసవానిపేట, ఆమదాలవలస

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

కాశీబుగ్గ: పలాస మండలం సున్నాడ గ్రామానికి చెందిన కుమ్మర ఉపేంద్ర(63) మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్వగ్రామం సున్నాడ నుంచి సైకిల్‌పై పలాస విద్యుత్ కార్యాలయానికి విద్యుత్ బిల్లు కట్టేందుకు వస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు స్పందించి ఆటోలో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులకు ఫిర్యాదు అందింది.

నేత కార్మికులకు ఉచిత విద్యుత్ అమలు చేయాలి



మగ్గాన్ని పరిశీలిస్తున్న సీఐటీయూ నాయకులు

ఎచ్చెర్ల: మగ్గమున్న ప్రతి చేనేత కార్మిక కుటుంబానికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీఐటియూ జిల్లా కార్యదర్శి ఎస్.వి.రమణ, చేనేత కార్మిక సంఘం నాయకుడు నక్కిన అసిరప్పుడు డిమాండ్‌చేశారు. మంగళవారం లావేరులో పర్యటించి చేనేత కార్మికుల సమస్యలపై సమావేశం నిర్వహించి అనంతరం మగ్గాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత కార్మికులు గిట్టుబాటు ధరలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత సహకార సంఘాలకు రుణమాఫీ చేసి ఆప్కో ద్వారా ప్రభుత్వం వస్త్రాలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నేతన్న నేస్తం పథకం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో చేనేత సంఘం నాయకులు కె.శంకరరావు, కె.రామారావు, యు.గంగరాజు, కె.గంగరాజు, భద్రకాళీ, బి.వెంకటరావు, యు.కాశీవిశ్వేశ్వరరావు, శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు ఆహ్వానం



కన్వీనర్ సుధాకరరావు

ఎచ్చెర్ల: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలకు మంగళవారం షెడ్యూల్ విడుదలైందని ఐటీఐ ప్రవేశాల జిల్లా కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ లండ సుధాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల 5 నుంచి 10 వరకూ ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో కౌన్సిలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని మూడు ప్రభుత్వ కళాశాలలో 640 సీట్లు, 20 ప్రైవేటు కళాశాలల్లో 2,872 సీట్లు భర్తీ చేస్తామని పేర్కొన్నారు.

సిమెంట్ లారీ దగ్ధం



నరసన్నపేట: తామారాపల్లి వద్ద జాతీయ రహదారిపై మంగళవారం సిమెంట్ లారీ దగ్ధమైంది. విశాఖ నుంచి పూరీ వెళ్తుండగా తామరాపల్లి వద్దకు వచ్చే సరికి మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి డ్రైవర్‌ను అప్రమత్తం చేయగా లారీ నిలుపు చేసి తగిన జాగ్రత్తలు తీసుకొనే లోపే మరింతగా మంటలు వ్యాపించాయి. వెంటనే స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా ఎస్ఎఫ్ఓ వరహాలు ఆధ్వర్యంలో సిబ్బంది హుటాహుటిన చేరుకుని మంటలను అదుపులోనికి తెచ్చారు. అప్పటికే లారీ కాలిపోయింది. ఈ ఘటనలో రూ. 5 లక్షల పైనే ఆస్తి నష్టం వాటిల్లినట్లు లారీ సిబ్బంది చెబుతుండగా.. అగ్నిమాపక సిబ్బంది మాత్రం రూ.2.5 లక్షల వరకూ నష్టం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.

విధులకు ఆటంకపరిచారని ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో గతంలో సహాయ సంచాలకులుగా పనిచేసిన పి.సూర్యారావు ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది విధులకు ఆటంకపరుస్తున్నారంటూ ప్రస్తుత ఆ శాఖ సంయుక్త సంచాలకుడు రాజగోపాల్ రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సీఐ పి.ఈశ్వరరావు మంగళవారం తెలిపారు. గతంలో సస్పెన్షన్‌కు గురైన సూర్యారావుకు హైకోర్టు సస్పెన్షన్ ఎత్తివేయాలంటూ ఉత్తర్వులిచ్చిందన్నారు. ఈ క్రమంలో సూర్యారావు కొంతమంది పత్రికా విలేకరులు, వీడియోగ్రాఫర్లను తన వెంట జిల్లా పశుసంవర్ధక కార్యాలయానికి తీసుకెళ్లి విధి నిర్వహణ నిమిత్తం తాను వచ్చానని, అటెండెన్సు రిజిస్టర్‌లో సంతకం పెడతానంటూ చెప్పడమే కాక వచ్చే పత్రికా విలేకరులతో వీడియో రికార్డింగ్ చేయించారన్నారు. పశుసంవర్ధక శాఖ విజయవాడ ప్రధాన కార్యాలయం నుంచి తగు ఉత్తర్వులు వచ్చేంతవరకు కార్యాలయంలో సూర్యారావును జాయిన్ చేసుకునే అవకాశం లేదని ఎంత చెప్పినప్పటికీ సిబ్బందిని భ భయభ్రాంతులకు గురిచేసి విధులకు ఆటంకం కలిగించారని పేర్కొన్నారు. ఈ మేరకు సంయుక్త సంచాలకుడు రాజగోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సూర్యారావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఇసుకాసురుల ముందుచూపు!

- రానున్న వర్షాకాలం నేపథ్యంలో ముందస్తుగా భారీగా ఇసుక నిల్వలు
- బైరి, కరజాడ బ్రిడ్జి పరిసర ప్రాంతాల్లో 15 వేల టన్నులకు పైగా పోగులు
- స్పందించని రెవెన్యూ, మైన్స్ అధికారులు



బైరి తోటల్లో ఇసుక పోగులు

శ్రీకాకుళం రూరల్ :

ఉచిత ఇసుక విధానం కూటమి నేతల పంట పండిస్తోంది. కొందరు నాయకులు నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం సాగిస్తూ నదీ పరివాహక ప్రాంతాల్లో భారీగా ఇసుక వ్యాపారం సాగిస్తూ కోట్ల రూపాయలు జేబులు నింపుకొంటున్నారు. శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలో నదీ పరివాహక ప్రాంతాలైన బైరి, కరజాడ ప్రాంతాల్లో రాత్రిపగలు తేడా లేకుండా ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. రెవెన్యూ, మైన్స్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం.. వీఆర్వో, పంచాయతీ సెక్రటరీలు సైతం తవ్వకాల వైపు కన్నెత్తి చూడకపోవడంతో తవ్వకాలు అనుమతులు కంటే భారీగా సాగుతున్నాయి. రానున్న వర్షాకాలంలో పెద్ద ఎత్తున ఇసుక వ్యాపారం సాగించేందుకే ఇలా భారీ ఎత్తున ఇసుకను పోగేస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



బైరి పరిసర ప్రాంతంలో ట్రాక్టర్లతో ఇసుక తవ్వకాలు

వాల్టా చట్టానికి తూట్లు..

వాస్తవంగా నదీ పరివాహక ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలకు అధికారులు అనుమతులు ఇచ్చే ముందు గ్రౌండ్ వాటర్ పరిశీలన చేయాల్సి ఉంది. ఇక్కడ తక్కువ మోతాదుల్లో నీటి సాంద్రత ఉండటం, గ్రౌండ్ వాటర్ అడుగంటడం, చుట్టూ వ్యవసాయ బోర్లు ఉన్నప్పటికీ అడ్డగోలుగా అనుమతులు ఇచ్చేశారు. బైరి, కరజాడ ప్రాంతాల్లో 1.5 మీటర్లు వరకే తవ్వకాలు చేయాల్సి ఉన్నా దాన్ని అధిగమించి భారీ ఎత్తున తవ్వకాలు సాగిస్తున్నారు.

ఇరువైపులా ఇసుక పోగులే..

బైరి నుంచి కరజాడ జంక్షన్ జాతీయ రహదారి మీదుగా వెళ్లే వంశధార నదికి ఆనుకొని ఉన్న ప్రదేశంలో కొన్ని వేల మెట్రిక్ టన్నుల ఇసుకను కూటమి నేతలు నిల్వ చేసేశారు. బ్రిడ్జికి రెండువైపులా ఎక్కడికక్కడ ఇసుక పోగులు కనిపిస్తుంటాయి. అక్కడితో ఆగకుండా తోటలు, పంట పొలాల గట్లుపై కూడా సుమారు 15వేల టన్నులకు పైగా ఇసుక నిల్వలు పోగేశారు.



కరజాడకు వెళ్లే తోటల్లో ఇసుక పోగులు



బైరి కరజాడ బ్రిడ్జి కింద ఇసుక నిల్వలు

ముందస్తు వ్యూహం..

ప్రస్తుతం చేస్తున్న పోగేస్తున్న ఇసుక నిల్వలతో రానున్న వర్షాకాలంలో మరింతగా ఇసుక వ్యాపారం చేసి లాభాలు గడించాలని అక్రమార్కులు వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న రేట్లు కన్నా వర్షాకాలంలో డబుల్, త్రిబుల్ రేట్లుగా వేసుకొని ఇసుకను బ్లాక్‌మార్కెట్‌లో అమ్మడం కోసమే బ్రిడ్జి పరిసర ప్రాంతాల్లో నిల్వలు చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది.

దాడులు చేస్తాం..

అక్రమ ఇసుక నిల్వలపై కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీసులు, మైన్స్ అధికారులు రెండు బృందాలుగా వీడి తనిఖీలు చేయనున్నాం. ఎక్కడ అక్రమంగా నిల్వలు ఉన్నా సీజ్ చేస్తాం.

– మురళీకృష్ణ, డిప్యూటీ డైరెక్టర్, మైన్స్

వెన్నుపోటు బాబుకు ప్రజలే బుద్ధి చెప్పాలి



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ కాళింగ కుల విభాగం నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సొంత మామకే వెన్నుపోటు పొడిచిన సీఎం చంద్రబాబు వంటి వ్యక్తికి ప్రజలకు వెన్నుపోటు పొడవటం పెద్ద లెక్క కాదని వైఎస్సార్ సీపీ కాళింగ కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు (రామారావు) అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రయివేటు హోటల్‌లో మంగళవారం కాళింగ కుల వైఎస్సార్‌సీపీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ తల్లికి వందనం పేరుతో పిల్లలకు వెన్నుపోటు.. అన్నదాత సుఖీభవతో రైతులకు వెన్నుపోటు, నిరుద్యోగ భృతి పేరుతో నిరుద్యోగులకు వెన్నుపోటు, ఉచిత బస్సు ప్రయాణం పేరుతో మహిళలకు వెన్నుపోటు.. ఇలా అన్నివర్గాల ప్రజలందరికి చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపుమేరకు బుధవారం ప్రతి నియోజకవర్గంలో జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకి కట్టుబడి మ్యానిఫెస్టోను పవిత్రగ్రంథంలా భావించి ఒక్క హామీని కూడా విస్మరించకుండా 99.9 శాతం సంక్షేమ పథకాలు ప్రజలకు అందించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో ఉద్యోగులు దగాకు గురయ్యారని చెప్పారు. ఇప్పటి వరకు ఒక్క డీఏ కూడా ఇవ్వలేదన్నారు. పీఆర్‌సీ కమిషన్ కూడా వేయకపోవడం అన్యాయమన్నారు.

కేటాయింపులేవీ?

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు చంద్రబాబు అబద్ధపు హామీలతో మరోసారి మోసపోయారని చెప్పారు. ప్రతి గ్రామంలో ఒక వ్యక్తిని పెద్దవాడిని చేయడానికి 3 వేల మందిని మోసగించడం అన్యాయమన్నారు. సంక్షేమ పథకాలకు రూ.83వేల కోట్లు అవసరం కాగా కేవలం రూ.7300 కోట్లు బడ్జెట్ కేటాయింపులు చేయడం అన్యాయమన్నారు. జిల్లాలో శాంతియుతంగా నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమంలో ప్రజలంతా స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, బాడాన సునీల్, గురుగుబెల్లి శ్రీనివాసరావు, తమ్మినేని వాసుదేవరావు, గురుగుబెల్లి లక్ష్మణరావు, తమ్మినేని మురళి, బాడాన కృష్ణ, కూన రాజు, తిర్లంగి లోకనాథం, బొడ్డేపల్లి నాగేశ్వరరావు, గురుగుబెల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

4 కేజీల గంజాయితో ఇద్దరు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి గుజరాత్‌కు అక్రమంగా గంజాయిని తరలించేందుకు ప్రయత్నించిన ఇద్దరు యవకులను ఇచ్ఛాపురం పట్టణ పోలీసులు అరెస్టు చేసినట్లు సీఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. మంగళవారం ఇచ్ఛాపురం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. ముందస్తు సమాచారం మేరకు ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ ఆవరణలో మంగళవా పోలీసులు తనిఖీలు నిర్వహిండగా.. బీహార్‌లోని బాగల్‌పూర్‌జిల్లా కాసరి గ్రామానికి చెందిన ఎండీ షెకావత్ అనే యువకుడు, ఒడిశాలోని గంజాం జిల్లా పాత్రపూర్‌బ్లాక్ ధర్మపూర్ గ్రామానికి చెందిన దల బెహర చిత్రసేన్ అనే యువకుడు బ్యాగ్‌లలో 3.990 గ్రాములు గంజాయితో పట్టుబడ్డారు. బీహార్‌కి చెందిన ఎండీ షెకావత్ అనే వ్యక్తి గుజరాత్ రాష్ట్రం వాపిలో నివాసముంటూ చిత్రసేన్ ద్వారా ఒడిశా నుంచి గంజాయిని తీసుకెళ్లి అక్కడ గంజాయి వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో చిత్రసేన్ గంజాయిని తీసుకొచ్చి షెకావత్‌కి అందజేసే క్రమంలో పట్టణ పోలీసులకు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లను పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కి తరలించారు. అక్రమ రవాణాను అడ్డుకున్న పట్టణ పోలీసులను ఎస్పీ అభినందించినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై ముకుందరావు, పట్టణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తీర్థయాత్రలకు ఐఆర్‌సీటీసీ ప్రత్యేక ప్యాకేజీలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఐఆర్‌సీటీసీ టూరిజం ఎగ్జిక్యూటివ్ సంఘమిత్ర రాల్

ఆమదాలవలస: తీర్థయాత్రలకు రైల్వే శాఖ ప్రత్యేక ఎయిర్ రైల్వే ప్యాకేజీలు తీసుకొచ్చినట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం ఎగ్జిక్యూటివ్ సంఘమిత్ర రాల్ తెలిపారు. మంగళవారం శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వే స్టేషన్ వద్ద విలేకరులతో ఆమె మాట్లాడుతూ జిల్లా ప్రజలకు అనుకూలంగా విమాన ప్యాకేజీతో శాంకరీ దేవి శక్తి పీఠం, శ్రీలంక రామాయణ యాత్రలకు విశాఖ నుంచి విమాన సర్వీసు నడుపుతున్నట్లు చెప్పారు. జూన్ 28న మొదలై జూలై 3తో ముగుస్తుందని తెలిపారు. ఒక వ్యక్తికి రూ.69,450 చార్జీగా నిర్ణయించినట్లు తెలిపారు. అదే విధంగా, కేరళ, గుజరాత్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లోనూ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక ప్యాకేజీలు సిద్ధం చేశామన్నారు. వివరాలకు 9281030748, 9281495847 నంబర్లను సంప్రదించాలని కోరారు. సమావేశంలో స్టేషన్ సూపరింటెండెంట్ ఎస్.ఉమామహేశ్వరరావు, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జి.వినేష్ పాల్గొన్నారు.

రేషన్ కోసం ఎదురుచూపులు



రేషన్ కోసం ఇంటి వద్ద ఎదురుచూపులు చూస్తున్న వృద్ధులు

రేషన్ వాహనాల రద్దుతో ఇటు సామాన్యులతో పాటు అటు వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందులు తప్పడం లేదు. వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకే రేషన్ సరుకులు తెచ్చి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇంతవరకు చాలాచోట్ల కార్యరూపం దాల్చడం లేదు. ప్రతి నెలా ప్రభుత్వం ఇచ్చే బియ్యంపైనే ఆధారపడుతున్నామని, మూడో తారీఖు ముగిసినా ఇంతవరకు రేషన్ ఇవ్వక పోవడంతో ఇంకెన్ని రోజులు ఎదురుచూడాలని పలువురు వృద్ధులు, దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



రేషన్ సరుకుల కోసం దివ్యాంగురాలు ధనలక్ష్మి ఎదురుచూపు



రేషన్ కోసం ఇంటి గుమ్మం వద్ద ఎదురుచూస్తున్న 75 ఏళ్ల వృద్ధురాలు ఎరుపిల్లి పోలమ్మ

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం రూరల్: శారీరక ఆరోగ్యానికి, మానసిక దృఢత్వానికి ప్రతిఒక్కరూ యోగా సాధన చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. యోగాంధ్రలో భాగంగా మంగళవారం శ్రీకాకుళం రూరల్ మండలం పెదగన్నలవానిపేట సముద్ర తీరంలో సుమారు ఐదు వేల మందితో కలిసి యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా అటవీశాఖ అధికారి వెంకటేష్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వేంకటేశ్వరరావు, ఆర్డీవో కె.సాయి ప్రత్యూష, డీఎంహెచ్ఓ డాక్టర్ కె.అనిత, మహిళా శిశుసంక్షేమశాఖాధికారి బి.శాంతి, ఆయుష్ వైద్యాధికారి జగదీష్ పాల్గొన్నారు.

స్కూటీ ఢీకొని వ్యక్తి మృతి



సంఘటన స్థలంలో మృతదేహం వద్ద విలపిస్తున్న కుమార్తె

ఇచ్ఛాపురం రూరల్: స్కూటీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇచ్ఛాపురంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఇదే మండలంలోని లొద్దపుట్టి గ్రామం పెద్ద వీధికి చెందిన దుర్గాశి మహేశ్(45) అదే గ్రామంలో మంగళవారం రేషన్ షాపు డీలర్ వద్ద అసిస్టెంట్‌గా సరుకులు పంపిణీ చేశాడు. అనంతరం పక్క గ్రామమైన ఒడిశా సవరదేవి పేటకు రాత్రి సమయంలో నడకదారిన వెళ్తుండగా.. ఒడిశా గుడ్డిభద్ర గ్రామానికి చెందిన గుర్తు తెలియని వ్యక్తి స్కూటీపై స్పీడుగా వచ్చి మహేశ్‌ను బలంగా ఢీ కొట్టాడు. దీంతో మహేశ్ సంఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. దీంతో స్కూటీ డ్రైవర్ బండిని వదిలి పరారయ్యాడు. మృతుడి భార్య చాలా రోజుల కిందట మృతి చెందగా పెద్ద కుమార్తెకు పెళ్లి చేశారు. మరో కుమార్తె ఉంది. కుటుంబ సభ్యులు పిర్యాధు మేరకు ఒడిశా జరడా పోటీసులు కేసు నమోదు చేశారు.

పాముకాటుతో కల్లుగీత కార్మికుడు మృతి

ఎచ్చెర్ల : అరిణాం అక్కివలస గ్రామ సమీపంలో బుడుమూరుకు చెందిన పొలుసు గోపి (39) మంగళవారం సాయంత్రం పాముకాటుకు గురై మృతి చెందాడు. గోపి వృత్తిరీత్యా తాటికల్లు తీసేందుకు అరిణాం అక్కివలస వచ్చి తాటి చెట్టు ఎక్కి దిగుతుండగా పాము కాటువేసింది. విషయం తెలుసుకున్న కుటుంబీకులు చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. గోపికి భార్య దేవి, కుమారుడు ఉన్నారు. ఎచ్చెర్ల ఎస్సై ఎస్.కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా కంచమ్మతల్లి వారోత్సవాలు



పురవీధుల్లో అమ్మవారు ఊరేగింపు



కాళికాదేవి నృత్యం



కంచమ్మతల్లి అమ్మవారి నమూనా విగ్రహం

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో నిర్వహిస్తున్న కంచమ్మతల్లి గ్రామదేవత ఉత్సవాలు రెండోరోజు మంగళవారం వైభవోపేతంగా జరిగాయి. అమ్మవారిని పీఠస్థానం నుంచి మఠం కంచిలి తీసుకొచ్చి, అక్కడి నుంచి ఊరేగింపుగా మెయిన్‌రోడ్డులోకి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం నాగదేవతలు, అమలాపురం కేరళ డ్రమ్స్, పద్మనాభపురం దూమ్ ధడాకా, పాలబొమ్మలు, స్థానిక కళాకారుల గ్రూపు డ్యాన్స్, రాజమండ్రి సినీ కోయడ్యాన్స్ తదితర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటుల చేసిన బొడ్డపాడు కళాకారుల జానపదాలు అలరించాయి. రైల్వేస్టేషన్ కూడలిలో మెయిన్‌రోడ్డు పక్కన కంచమ్మతల్లి అమ్మవారి నమూనా విగ్రహం విశేషంగా ఆకట్టుకుంటోంది. బంగారు, వజ్రాభరణాలను అలంకరించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

రేపు కోర్టు ఆవరణలో పర్యావరణ దినోత్సవం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 5న ఉదయం 9:30 గంటలకు జిల్లా కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పచ్చదనాన్ని పెంపొందించి భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనేదే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

జీఎస్టీ ఆదాయంలో క్షీణత

- జనవరి నుంచి మే వరకు రూ.15 కోట్లకుపైగా తగ్గిన ఆదాయం
- ప్రజల్లో తగ్గిన కొనుగోలు శక్తి
- గతంలో పథకాలు రావడంతో పెరిగిన లావాదేవీలు
- కూటమి వచ్చాక పథకాలు లేక తగ్గిన కొనుగోళ్లు

శ్రీకాకుళం: కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజల కొనుగోళ్ల శక్తి తగ్గడంతో ఆ ప్రభావం జీఎస్టీ ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. జిల్లాలో అన్ని వ్యాపారాలు కలిపి జనవరి నుంచి మే నెల వరకు రూ.1500 కోట్లు మేర లావాదేవీలు జరిగాయి. దీని ద్వారా ప్రభుత్వానికి జీఎస్టీ రూపేణా ఆదాయం లభించింది. అయితే గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.15 కోట్లకు పైగా జీఎస్టీ ఆదాయం తగ్గింది. మద్యం మినహాయిస్తే ఏ వ్యాపారాన్ని చూసినా గతేడాది కంటే ఈ ఏడాది 5 నెలల్లో లెక్కలు పరిగణనలోకి తీసుకుంటే చాలా వ్యత్యాసం కన్పిస్తోంది. ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గడమే దీనికి కారణం.

- జిల్లాలో 2024లో జనవరి నుంచి మే వరకు రడీమేడ్ వస్త్ర వ్యాపారం రూ.120 కోట్లకు పైగా జరిగింది. ఈ ఏడాది అది రూ.80 కోట్లకు తగ్గింది.
- జిల్లా వ్యాప్తంగా ఉన్న రెస్టారెంట్లలో జనవరి నుంచి మే వరకు రూ.50 కోట్లకు పైబడి వ్యాపారం జరిగేది. ఈ ఏడాది అది రూ.35 కోట్లకు పరిమితమైంది.
- కిరాణా సరుకులు, నిత్యావసర సరుకుల క్రయవిక్రయాలు జనవరి నుంచి మే వరకు రూ.800 కోట్లు వరకు జరిగేవి. ఈ ఏడాది రూ. 550 కోట్లు వరకు మాత్రమే జరిగాయి.

పథకాల్లో కోత..

గత ప్రభుత్వ హయాంలో పింఛన్లు సకాలంలో అందేవి. అమ్మఒడి, రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, చేదోడు, రైతు బీమా, సున్నా వడ్డీ, కాపు నేస్తం వంటి ఎన్నో పథకాలు సకాలంలో అందేవి. దీంతో పేద ప్రజలు తమకు కావాల్సిన నిత్యావసర సరుకులు, ఇతర వస్తువులు కొనుగోలు చేసుకుండేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పింఛన్లు సకాలంలో ఇస్తున్నప్పటికీ చాలా మందికి కోత విధించారు.



తల్లికి వందనం, మహిళలకు రూ.1500, రైతు బీమా, సూపర్ సిక్స్ అంటూ ఎన్నో పథకాలను అమలు చేయకుండా వదిలేశారు. మరోవైపు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్లాన్ అప్రూవల్ జరగకపోవడం, ఇంటి నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోవడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. రైతుకు సహాయం చేసే పథకాలు ఎత్తివేయడం, గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో వ్యవసాయ పనులు కూడా తగ్గిపోయాయి. వీటి కారణంగా కూలి పనులు లేకుండా పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధరలు పెరిగిపోతుండగా ఉద్యోగులకు డీఏలు, పీఆర్‌సీలతో పాటు మరెన్నో ప్రయోజనాలు అందడం లేదు. ఉద్యోగ విరమణ చేసిన వారికి సైతం గ్రాట్యుటీ వంటి ఇతర ప్రయోజనాలకు మంజూరు చేయకపోవడం, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నెలల తరబడి జీతాలు ఇవ్వకపోవటం, ఉపాధి హామీ వేతనదారులకు సకాలంలో బిల్లులు చెల్లింపులు జరపకపోవటంతో జీవనానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలా అన్ని వర్గాల వారిపై వేటు వేయడంతో ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గిపోయింది.

జీఎస్టీ ఆదాయ వివరాలివే..

2024లో జనవరి 1 నుంచి మే 31 వరకు రూ.105.96 కోట్లు ఆదాయం లభించింది. 2025లో జనవరి 1 నుంచి మే 31 వరకు రూ.86.05 కోట్లకే ఆదాయం పరిమితమైంది. సర్కిళ్ల వారీగా పరిశీలిస్తే 2024 ఆమదాలవలస సర్కిల్లో రూ.17.85 కోట్లు, 2025 రూ.14.25 కోట్లు, కాశీబుగ్గలో 2024లో రూ.8.52 కోట్లు, 2025లో రూ.9 కోట్లు, నరసన్నపేట సర్కిల్‌లో 2024లో రూ.10.05 కోట్లు, 2025లో రూ.11.15 కోట్లు , 2024లో శ్రీకాకుళం సర్కిల్‌లో రూ.68.87 కోట్లు, 2025లో రూ.51.75 కోట్లు ఆదాయం వచ్చింది.